క్లుప్తంగా

ఆర్బీకేల్లో పచ్చిశనగ సాగు రైతుల జాబితా



ఆర్బీకేలో జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

కలువాయి: మండలంలో పచ్చిశనగ సాగు చేసే రైతుల జాబితాను ఆయా ఆర్బీకేల్లో ప్రదర్శించామని మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతుల జాబితాలను ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శించారు. రైతులు జాబితాలను పరిశీలించి మార్పులు, చేర్పులు, అభ్యంతరాలను సంబంధిత వీఏఏల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వారు పరిశీలించి మార్పులు,చేర్పులు చేస్తారని వివరించారు. అభ్యంతరాలు ముగిసిన తరువాత తుది జాబితాలో పేరు ఉన్న ప్రతిరైతు తమ ఆధార్ కార్డ్, పాస్‌బుక్ తీసుకొచ్చి ఆర్బీకేల్లో వేలిముద్ర వేసి సబ్సిడీ విత్తనాలు పొందవచ్చన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



దారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

దక్కిలి (బాలాయపల్లి): చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. పెరిమిడి పంచాయతీలోని వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక హక్కులకు సంబంధించినవే పౌరహక్కులు అని పేర్కొన్నారు. అంతకుముందు వెంకటేశ్వపురం ఎస్టీలు కాలనీ నుంచి వెంకటగిరి–నాయుడుపేట మెయిన్ రోడ్డుకు వెళ్లే దారి సమస్యను తహసీల్దార్‌కు వివరించారు. స్పందించిన తహసీల్దార్ కాలిబాటను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బీరంప్రదీప్, వీఆర్వో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

జూడో పోటీల్లో విజేతలకు అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీడీ

చిల్లకూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ క్రీడా పోటీల్లో భాగంగా ఈనెల 28 నుంచి 30 వరకు జరిగిన జూడో పోటీల్లో రెండు విభాగాల్లో చిల్లకూరు గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మీరాసాహెబ్ తెలిపారు. చిల్లకూరులోని గురుకుల కళాశాలలో రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో కాంస్య పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరు గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న వి.దినేష్‌కుమార్ 76 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడని అన్నారు. అలాగే 45 కేజీల విభాగంలో ఏ.మహేష్ కాంస్య పతకాన్ని సాధించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. విజేత విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ దాసరి శ్రీరేష్, పీఈటీ అఖిలను ప్రిన్సిపల్, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష



పెళ్లకూరు: కిట్ల పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు

పెళ్లకూరు: పాలచ్చూరు సచివాలయ ప్రాంగణంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు ఉమ, సుజాత వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, తహసీల్దార్ రామయ్య, ఎంఈఓ శంకరయ్య, సర్పంచ్ పెళ్లూరు షర్మిళ, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, ఉపసర్పంచ్ కూచివాడ సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పి.దశరథరామిరెడ్డి, నేతలు పెళ్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, మద్దాల కీర్తిరెడ్డి, వీఆర్వో రమేష్, కార్యదర్శి వసంత్‌కుమార్, పాల్గొన్నారు.

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవానికి వైద్యసేవలు అందించి ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలంలో మంగళవారంతో ముగిసింది. చివరిరోజున తమ్మినపట్నం సచివాలయం పరిధిలోని తమ్మినపట్నం, గుమ్మళ్ల దిబ్బ, కొత్తూరు గ్రామాలకు చెందిన 450 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యులు గీతామణి, కల్యాణ్, శ్రీపావని, సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ మాణిక్యం పాల్గొన్నారు.



చిల్లకూరు: కిట్లను అందజేసిన వైద్యులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి



బూదనంలో నిర్వహిస్తున్న గ్రామసభ

చిల్లకూరు: బూదనం పంచాయతీలోని పత్రగుంటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణను మంగళవారం ఆ కాలనీ వాసులు కోరారు. బూదనం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో విచారణ నిమిత్తం వచ్చిన డీఎల్‌పీఓ ఎదుట పత్రగుంట వాసులు నీటి కష్టాలను ఏకరువు పెట్టారు. వారు మాట్లాడుతూ బూదనం నుంచి గతంలో పైపుల ద్వారా నీటిని సరఫరా చేస్తుండేవారని అన్నారు. అయితే గత ఏడాది క్రితం పైపులు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని, అప్పటి నుంచి నీటిని కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎల్‌పీఓ స్పందించి రెండు రోజుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరలో తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి జమీర్‌బాషా, నేతలు కనపర్తి దిలీప్‌రెడ్డి, మైలాం శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయాలి

నాయుడుపేటటౌన్: పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ పార్కు సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుచేయాలని స్థానిక వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి పొలూరు దశరథరామిరెడ్డి, పార్టీ నేతలతో కలిసి కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌ను కలిసి ఆ మేరకు విగ్రహం ఏర్పాటుచేయాలని కోరారు. కౌన్సిలర్లు దారా రవి, కె.అశోక్‌కుమార్, కె.భావన్, నేతలు డి.రాజశేఖర్‌రెడ్డి, కె.భానుప్రసాద్, కె.శీను పాల్గొన్నారు.

రక్తదానశిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న పోలీసులు, యువత

కోట: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వాకాడు సీఐ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో కోట ప్రభుత్వ వైద్యశాలలో మెగా రక్తదానశిబిరం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది, యువత పాల్గొని రక్తదానం చేశారు. గూడూరు ఏరియా ఆస్పత్రి సిబ్బంది రక్తాన్ని సేకరించారు. శిబిరంలో 350 మంది రక్తదానం చేశారు. సీఐ హరిక్రిష్ణ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఎస్‌ఐలు పుల్లారావు, రఘునాథ్, గోపి పాల్గొన్నారు.

అమరుల త్యాగం చిరస్మరణీయం



ర్యాలీలో విద్యార్థులు, బెటాలియన్ సిబ్బంది

వెంకటగిరిరూరల్: విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు అమరుల త్యాగం చిరస్మరణీయమని 9వ బెటాలియన్ కమాండెంట్ పి.ప్రకాష్ తెలిపారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం 9వ బెటాలియన్ కమాండెంట్ ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణంలోని త్రిభువని సెంటర్ నుంచి క్రాస్‌రోడ్డు సెంటర్ వరకు బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం 9వ బెటాలియన్‌లో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోష్, అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్‌కన్నా, ఎంఎల్ మనోహర్, ఆర్ఐ నందీశ్వరరావు, గంగరాజు, దుర్వాసులు, భాస్కర్, వెంకటేశ్వర్లు, సివిల్ ఎస్‌ఐలు నరసింహారావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

● డీఎల్‌డీఓ వెంకటశేషయ్య

దొరవారిసత్రం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని డీఎల్‌డీఓ వెంకటశేషయ్య అన్నారు. మంగళవారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన జరిగిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన ప్రభుత్వ పథకాల అమలు, ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నా రు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురావయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

వెంకటగిరిరూరల్: అనారోగ్యానికి గురై స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని 70 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. ఎస్‌ఐ నరసింహారావు వివరాల మేరకు గుర్తు తెలియని ఓ వ్యక్తి అనారోగ్యానికి గురై స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్నట్లు తెలిపారు. స్పందించిన స్థానికులు అతన్ని వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

చిట్టమూరు: పేద విద్యార్థినికి తోడ్పాటును ఇచ్చే క్రమంలో ట్రస్టు ద్వారా మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. కొత్తగుంటలోని టీఎంఆర్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హిమబిందు చదువులకు అవసరమైన ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడుతుండగా గుర్తించిన వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాత ఎస్ఆర్ఐ విద్యాసాగర్ దాతృత్వంతో పాఠశాల డైరెక్టర్ విజయలక్ష్మి చేతులమీదుగా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్ రహంతుల్లా, కార్యదర్శి ఆశా శీనయ్య పాల్గొన్నారు

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవ ర్యాలీ



విందూరు ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

గూడూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలోని విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, వలంటీర్లు, ఉపాధ్యాయులు మంగళవారం గ్రామంలో జాతీయ ఐక్యతా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పౌరశాస్త్ర అధ్యాపకులు ప్రవీణ్‌గురు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యానగర్‌లో..

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. దేశ సమగ్రతకు పాటుపడతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కళాశాల నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ రామక్రిష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గాది శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

మండల పరిషత్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ భవాని, సిబ్బంది నివాళులర్పించారు.

జగన్ సుపరిపాలన దేశానికే ఆదర్శం



వెంకటగిరి: లబ్ధిదారుకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

● నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 5వ వార్డు కాలేజీమిట్టలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లికి స్థానికులు పూల వర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లి ఆయన రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేదురుమల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదిలోనుంచి పుట్టిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు భరోసాగా నిలుస్తున్నాయన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో సంక్షేమపథకాలు అమలవుతున్నాయని తెలిపారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి మళ్లీ ఆయన్ను గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. కాలేజీమిట్టకు చెందిన వృద్ధురాలు అడపాల నాగులమ్మ మళ్లీ జగనే సీఎం అవుతారని జోస్యం చెప్పారు. పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, కౌన్సిలర్లు వహిద, ఆరి శంకరయ్య, నేతలు తలపల చెంచుమల్లికార్జున్, రాజేశ్వరి, పవన్, వెందోటిబాబు, మంగళపూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ కాంతులతో సంతోష దీపావళి

సైదాపురం: గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కాంతులతో ప్రజలు సంతోష దీపావళి చేసుకుంటున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఊటుకూరు సచివాలయ పరిధిలో ఊటుకూరు మిక్స్‌డ్ కాలనీ, పెరుమాళ్లపాడు, పొక్కందల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నేదురుమల్లికి పూలవర్షం కురిపిస్తూ, అడుగడుగునా మహిళలు హారతులు పడుతూ నీరాజనాలు పలికారు. అనంతరం నేదురుమల్లి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2014లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందన్నారు. ప్రతి పేదవాణి ఇంట సంతోషం చూడాలన్న లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక లోటులోనూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మండల కన్వీనర్ రవికుమార్, కార్యవర్గ సభ్యుడు తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ వి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ భాస్కర్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులురాజు, సర్పంచ్ గీత, సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, ఉపసర్పంచ్ అంకయ్య, నేతలు రామ్‌గోపాల్‌రెడ్డి, ప్రసాద్‌రాజు, ప్రసాద్, వెంకట్రామయ్య, కేశవులు, కనకరాజు, వెంకటేశ్వర్లు, పి రవి, కృష్ణయ్య, రామయ్య, ప్రసాద్. రమేష్‌రాజు, సుబ్రమణ్యం, తిరుపాలు పాల్గొన్నారు.



సైదాపురం: నేదురుమల్లికి పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న పొక్కందల వాసులు

పట్టుదలతో ముందుకు సాగాలి

–జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సంయుక్త



మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త

నాయుడుపేట: విద్యార్థి దశ నుంచే ఏదైనా సాధించగలం అనే పట్టుదలతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సంయుక్త సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మండల లీగల్ సర్వీస్ కమిటీ సారథ్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయపరమైన సలహాలపై అవగాహన కల్పించేలా విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. చిన్న వయస్సులోనే విద్యార్థులు ఒత్తిడికి గురవుతూ మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటే ఏదైనా సాధించవచ్చన్నారు. సమస్యలపై న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. ప్రిన్సిపల్ మధుసూదన శర్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీఎస్‌కే కిషోర్, న్యాయవాదులు సీహెచ్‌కుమార్, పి.చెంగయ్య, రమణయ్య, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా!



ఎమ్మెల్సీ మేరిగను సత్కరిస్తున్న సభ్యులు

గూడూరురూరల్: పట్టణ గ్రామ దేవత తాళ్లమ్మ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ మేరిగ మురళీధర్ అన్నారు. స్థానిక సనత్‌నగర్‌లోని తన నివాసంలో మంగళవారం తాళ్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కమిటీ సభ్యులు తాళ్లమ్మ ఆలయంలో త్వరలో జరగనున్న ఉత్సవాలను వివరించారు. ఉత్సవాలకు రావాలని ఆయన్ను ఆహ్వానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆలయంలో జరిగే ఉత్సవాలకు, ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో కమిటీ సభ్యులు చెంచయ్యగౌడ్, చంద్రయ్య గౌడ్, చిన్న గౌడ్, పెంచలయ్య గౌడ్, శ్యాంప్రసాద్‌గౌడ్, సూర్యగౌడ్ ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సమష్టి కృషి

● మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ● కౌన్సిల్‌లో పది తీర్మానాలు ఆమోదం



సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ అభివృద్ధికి సమష్టిగా అందరూ కలిసి కృషిచేయాలని మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి తెలిపారు. సూళ్లూరుపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక స్త్రీశక్తి భవనంలో చైర్మన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కౌన్సిల్‌లో సభ్యులు, కౌన్సిలర్లు మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం సమావేశంలో పది తీర్మానాలను ఆమోదించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అందరూ పనిచేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ నరేంద్ర పాల్గొన్నారు.